ముగిసిన జర్నలిస్టుల వర్క్‌షాప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కథన జర్నలిజమ్‌పై రెండు రోజుల వర్క్‌షాప్, న్యూస్ ఇన్ టేల్స్ కార్యక్రమం ముగిసింది. చ్‌సీయూ, కెనడా హైకమిషన్ భాగస్వామ్యంతో న్యూస్‌రీల్ ఆసియా ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్‌సీయూ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు ప్రొఫెసర్ వినోద్ పవరాల, ప్రొఫెసర్ అంజలిలాల్ గుప్తా వ్యాఖ్యానాలతో ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత భారతదేశంలో కెనడా తాత్కాలిక డిప్యూటీ హైకమిషనర్ జియోఫ్రీడీన్ స్వాగత ప్రసంగం చేశారు. ది హన్స్ ఇండియా, హెచ్ఎంటీవీ మాజీ సీఈఓ, ఎడిటర్ రామచంద్రమూర్తి ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. న్యూస్‌రీల్ ఆసియా వ్యవస్థాపకుడు, డైరెక్టర్ విశాల్ ఆరోరా, సహ వ్యవస్థాపకులు సురభిసింగ్, హర్షిత రాథోడ్లతో కలిసి సెషన్‌లకు నాయకత్వం వహించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

రాయదుర్గం: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదివే అరవింద్ వెండి పతకం, రాకేష్ కాంస్య పతకాన్ని జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సాధించారు. వారికి సర్టిఫికెట్లు అందించి మెడల్స్‌ను పరిశీలించి వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..చదువుకునే సమయంలోనే క్రీడలు ఆడితే భవిష్యత్తులో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) పార్ట్‌టైమ్ కోర్సులో ప్రవేశానికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం వారు దరఖాస్తులను కోరుతున్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంను సమర్పించడానికి ఆగస్టు 8 చివరి తేదీగా నిర్ణయించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఇంటర్వ్యూల ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయి. ఇంటర్వ్యూకు అర్హత ఉన్న అభ్యర్థుల జాబితా ఆగస్టు 14న ప్రదర్శిస్తారు. ఇంటర్వ్యూ ఆగస్టు 18న జరుగుతుంది. ఆన్‌లైన్ అడ్మిషన్ ఫీజు చెల్లింపు తేదీ ఆగస్టు 21, 22 తేదీలలో నిర్వహిస్తారు. 30 సీట్లకు అడ్మిషన్లు అందుబాటులో ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

రాయదుర్గం: శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో రాజరాజేశ్వరి మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, కలువ పూలు, ఇతర పూలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అదే తరహాలో చంద్రమౌళీశ్వర స్వామి, షిర్డీ సాయిబాబా, ఆంజనేయస్వామి, గణపతి, పెద్దమ్మ, మైసమ్మ అమ్మవారికి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


రాజరాజేశ్వరి మాతకు ప్రత్యేక అలంకరణ


అన్నపూర్ణాదేవికి ప్రత్యేక అలంకారం

శివసాయిక్షేత్రంలో..

శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఆలయంలోని షిర్డీ సాయిబాబా, గణపతి, ఆంజనేయస్వామి, కాలభైరవ స్వామి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని, దేవతామూర్తులను దర్శించుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

మియాపూర్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని చందానగర్ ఉప కమిషనర్ శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆమన్‌కాలనీ, చిరంజీవినగర్, ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీలో అధికారులతో కలిసి వారు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తగా వేరుచేసి చెత్తను ఆటోరిక్షా వారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు డీఈ దుర్గా ప్రసాద్, శానిటేషన్ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఎంటమాలజీ ఏఈ చిన్నా రమావత్, ఎస్ఆర్‌పీ మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


చిరంజీవినగర్ కాలనీలో పర్యటిస్తున్న ఉప కమిషనర్ శశిరేఖ, కార్పొరేటర్ శ్రీకాంత్

జాతీయ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్–2025లో సత్తా

గచ్చిబౌలి: 5వ జాతీయ స్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్–2025 రెజ్లింగ్ పోటీల్లో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు తమ సత్తాచాటారు. ఈ పోటీలను ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో నిర్వహించారు. తెలంగాణ గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో మొత్తం 15 పతకాలను క్రీడాకారులు సాధించారు. అందులో ఆరు బంగారు పతకాలు, నాలుగు వెండి, అయిదు కాంస్య పతకాలను సాధించారు. తెలంగాణ రెఫరీలు హరిశరణ్, జి. రవికిరణ్, బి.పవన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు శిక్షణ పొందారు. పతకాలు సాధించిన విద్యార్థులను అసోసియేషన్ చైర్మన్ ముంగిజైపాల్‌రెడ్డి, అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షుడు సాయినందుయాదవ్, ప్రధాన కార్యదర్శి దాస్ మనోజ్‌కుమార్, టీమ్ మేనేజర్ పాండు, కోచ్ ఈ ప్రశాంత్ అభినందించారు.


15 పతకాలు సాధించింది వీరే

గోపన్‌పల్లి జర్నలిస్ట్‌కాలనీలో హైడ్రా కమిషనర్ పర్యటన

గచ్చిబౌలి: గోపన్‌పల్లి జర్నలిస్ట్‌కాలనీ ఫేజ్–3లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం పర్యటించారు. కారు పార్కింగ్ లేకుండా నిర్మించిన కమర్షియల్ వాణిజ్య సముదాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాదచారులకు ఇబ్బంది కలిగేలా ఫుట్‌పాత్ ఆక్రమించి కార్లు పార్కు చేసిన విషయాన్ని గమనించారు. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. జర్నలిస్టు కాలనీలోని సమస్యలన్ని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని స్థానికులు తెలిపారు. ఆక్రమణలను తొలగించేలా చూడాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

స్పందించారు.. పనులు చేపట్టారు..


సీసీ రోడ్డు పనులు చేపట్టిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు పనులను ఎట్టకేలకు అధికారులు ప్రారంభించారు. దీప్తి శ్రీనగర్ కాలనీలో రోడ్డు నిర్మాణం పనుల కోసం మోకాళ్ల లోతు గుంతలు తవ్వి వదిలేయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సాక్షి దినపత్రికలో 'గుంతల రోడ్లతో దడ' అనే శీర్షిక ప్రచురితమైంది. 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు వెంటనే కాలనీలో సీసీ రోడ్డు పనులను చేపట్టారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బీటీఎన్‌జీఓస్‌కు స్థలం ఇచ్చే వరకు పోరాటం ఆగదు

గచ్చిబౌలి: ఆక్రమణకు గురైన బీఎన్‌జీఓస్ స్థలం తిరిగి అప్పగించే వరకు పోరాటం ఆగదని రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం గోపన్‌పల్లిలోని బీటీఎన్‌జీఓస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూమిగా ఉన్న స్థలం ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులది ఎలా అయ్యిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను అడిగామన్నారు. లేఅవుట్ చేసి అభివృద్ధి చేశామని, తెలంగాణకు చెందిన ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారని, ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు ఇక్కడే పుట్టిపెరిగారని తెలిపారు. గోపన్‌పల్లి సర్వే నెంబర్ 36లో బీటీఎన్‌జీఓస్ ఉన్న 149 ఎకరాలలో 17.20 ఎకరాలను ఆక్రమణకు గురైందన్నారు. ఇప్పటికే రాష్ట్ర రెవెన్యూ మంత్రిని కలిసి సమస్య తెలిపామని, త్వరలో సీఎంను కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ అసోసియేట్ ప్రెసిడెంట కస్తూరి వెంకట్, బీటీఎన్‌జీఓస్ నాయకులు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

దుర్గం చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య


చంద్రేస్ జైన్(ఫైల్)

మాదాపూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక దుర్గం చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..తిరుమలగిరిలోని ఆర్టీసీ కాలనీకి చెందిన చంద్రేస్ జైన్(34) వ్యాపారం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. గత నెల 30న చంద్రేస్ జైన్ స్నేహితుడిని కలవడానికి రాపిడో బుక్ చేసుకుని వెళ్లినట్టు తెలిపారు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఈనెల 31న అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేశారు. అదే రోజు చంద్రేస్ జైన్ ఆర్థిక సమస్యల కారణంగా దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. లేక్ పోలీసులు గుర్తించి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ భాషా ఒలంపియాడ్‌లో సత్తా చాటిన భారత్

రాయదుర్గం: అంతర్జాతీయ భాషా ఒలంపియాడ్–2025లో భారతదేశం సత్తా చాటింది. ఈ ఒలంపియాడ్‌లో ఒక స్వర్ణం, ఒక కాంస్య పతకం, రెండు గౌరవనీయ ప్రస్తావనలను గెలుచుకుంది. అరుదైన భాషలను డీకోడ్ చేయడం, ఆధారాలను డీక్రిప్ట్ చేయడంపై ఉన్న ప్రేమ కారణంగా జూలై 30న తైవాన్‌లోని తైపీలో ముగిసిన–22వ అంతర్జాతీయ భాషా ఒలంపియాడ్(ఐఓఎల్)లో భారతదేశానికి చెందిన నలుగురితో కూడిన యువ బృందం వీటిని సాధించింది. ఈ బృందానికి గచ్చిబౌలిలోని ట్రిపుల్ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ పరమేశ్వరి కృష్ణమూర్తి నాయకత్వం వహించారు. వారితోపాటు ట్రిపుల్ఐటీలో అండర్‌గ్రాడ్యుయేట్ పరిశోధకురాలు, గతంలో ఐఓఎల్‌లో పాల్గొన్న అన్షుల్ కృష్ణదాస్ భగవత్ అనే పరిశీలకుడు కూడా ఉన్నారు. ఆ జట్టులోని యువకుల్లో 15 ఏళ్ల వాగీశన్ సురేంద్రన్ (చెన్నయ్), 12 ఏళ్ల అద్వే మిశ్రా (న్యూఢిల్లీ), 18 ఏళ్ల నంద గోవింద్ అనురాగ్ (బెంగళూరు) 15 ఏళ్ల సిరిపరుపు భువన్ (హైదరాబాద్)కు చెందిన వారు ఈ ఒలంపియాడ్‌లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 227 మంది పోటీదారులు 57 టీమ్‌లుగా 42 దేశాల నుంచి పాల్గొన్నారు. భారతదేశం ఐఓఎల్‌లో 2009 నుంచి పాల్గొంటుండగా ప్రస్తుతం సాధించిన పతకాలే అత్యధికం కావడం విశేషం.

కనీస వేతనాలు అమలు చేయాలి



రామచంద్రాపురం(పటాన్ చెరు): రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ బేసిస్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, పూజారులకు కనీస వేతనం అమలు చేయాలని ఎమ్మెల్సీ సీ.అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రాపురంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ..దేవాదాయ శాఖ లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగులు సరైన వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ మాట్లాడుతూ.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో ముగ్గురికి రూ. 1,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

హెచ్ఐసీసీలో అవయవదానంపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో లలితా రఘురామ్ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం బ్రెయిన్ డెత్, అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సీఎంఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మోహన్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ లలితా రఘురామ్ ప్రముఖ డాక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవయవదానంపై అవగాహన పెరగాలన్నారు. మెడికవర్ ఆసుపత్రుల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీహరి కృష్ణ మాట్లాడుతూ..ఉత్తమ పద్ధతులను పాటించేలా వైద్యులను ప్రోత్సహించడమే కాకుండా సాధారణ ప్రజలకు అందించి అవయవదానంపై సరైన అవగాహన కల్పించాలన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆసుపత్రి క్రిటికల్ కేర్ చైర్ డాక్టర్ రాహుల్‌పండిత్, సిటిజెన్స్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ పీబీఎన్ గోపాల్, మెడికవర్ సీనియర్ నిపుణులు డాక్టర్ రంజిత్, డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ ఖాన్, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ అజయ్‌సిండే వంటి ప్రముఖ వక్తలు చట్టపరమైన అంశాలను గూర్చి వివరించారు.